## హైదరాబాద్‌లో రాయల్ ఓక్ విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ రాయల్ ఓక్ ఫర్నిచర్ నగరంలోని మలక్‌పేటలో తమ నూతన స్టోర్‌ను తెరిచింది. శనివారం దీనిని రాయల్ ఓక్ ఫర్నిచర్ ఛైర్మన్ విజయ్ సుబ్రమణియం, ఎండి మథన్ సుబ్రమణియం, రిటైల్ హెడ్‌హెచ్‌ఎస్ సురేష్ లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 18000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. దీంతో హైదరాబాద్‌లో 19 స్టోర్లకు, దేశ వ్యాప్తంగా 159 స్టోర్లకు విస్తరించినట్లయ్యిందని విజయ్ సుబ్రమణియం తెలిపారు. 116 నగరాల్లో కార్యకలాపాలను కలిగి ఉన్నామన్నారు.

## హైదరాబాద్ ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా వసుంధర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గణాంకశాఖ ఉప సంచాలకులు జి.వసుంధర హైదరాబాద్ జిల్లా గణాంక శాఖ ఉప సంచాలకులు (అర్బన్)గా బదిలీ అయ్యారు. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

## ఓటేయడం హక్కుకాదు.. బాధ్యత

- 5కే రన్‌లో ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓటేయడం హక్కు మాత్రమే కాదని, బాధ్యత కూడా, యువత ముందంజలో ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం హైటెక్స్‌లో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ద్వారా ఆధారితమైన ఎన్‌ఎండిసి హైదరాబాద్ మారథాన్ 12వ ఎడిషన్ 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను సంయుక్తంగా జెండా ఊపి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఎన్‌ఎండిసి చైర్మన్ అమితవ ముఖర్జీ, ఐడిఎఫ్‌సి హెడ్ అమిత్ సిన్హా, ఎన్‌ఎండిసి హైదరాబాద్ మారథాన్ 2023 డైరెక్టర్ ప్రశాంత్ మోర్పారియా, ప్రారంభించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని అన్నారు. నగరంలోని యువకులు, శక్తివంతమైన పౌరులతో కనెక్ట్ కావడానికి ఇంతకంటే మెరుగైన మార్గం ఏముంటుందన్నారు. యువత అర్బన్ ఎనర్జీ గ్రోత్ ఇంజన్ అన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, బయటకెళ్లి ఓటెయడం మీ బాధ్యత కూడా అని సూచించారు. 'ఎన్నికలు, ఎన్నికల ప్రక్రియల్లో పాల్గొనండి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం అయ్యేలా ఇతరులను ప్రేరేపించండి. గ్రామీణ, పట్టణ ఓటింగ్ శాతంలో భారీ అంతరం ఉంది. మనం దీన్ని మార్చాలి. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలు. మీరు ఓటెయ్యండి..ఇతరులతో వేయించండి' అని పిలుపునిచ్చారు.

# పది పాసయితే రూ.10 వేలు

- డిగ్రీకి రూ.25 వేలు, పిజికి రూ.లక్ష, పిహెచ్‌డికి రూ.5లక్షలు
- ఎస్‌సిలకు 18, ఎస్‌టిలకు 12 శాతం రిజర్వేషన్లు
- ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ప్రకటించిన రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితులు, గిరిజనులను ఆదుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌ను టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కెవిఆర్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజాగర్జన సభలో రేవంత్ దళిత డిక్లరేషన్ ప్రకటించారు. సభ ప్రారంభంలో గద్దర్ చిత్రపటానికి మల్లికార్జున ఖర్గే పూలమాల వేసి నివాళులర్పించారు. ఖర్గే సమక్షంలో పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యకర్తలు భారీగా రావడంతో చేవెళ్ల-శంకర్‌పల్లి వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలివే..**

- అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు రూ.12లక్షలు
- కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్లు కల్పిస్తాం. ఎస్‌సిలకు 18శాతం, ఎస్‌టిలకు 12 శాతం ప్రభుత్వ కాంట్రాక్టులు.
- పోడు భూములకు పట్టాలు. ఎస్‌సి, ఎస్‌టిలకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.6లక్షలు.
- రాష్ట్రంలో కొత్తగా 5 ఐటిడిఎలు, 9 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు.
- ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు పదో తరగతి పాస్ అయితే రూ.10వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.25వేలు, పీజీ పూర్తి చేస్తే రూ.లక్ష, పీహెచ్‌డీ, ఎంఫిల్ పూర్తి చేసిన వారికి రూ.5 లక్షలు సాయం.
- ప్రతి మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు.
- గ్రాడ్యుయేషన్, పీజీ చదివే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు వసతి.
- జనాభా ప్రాతిపదికన ఎస్‌సిలకు 18శాతం, ఎస్‌టిలకు 12 శాతం రిజర్వేషన్లు.
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే కంపెనీల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు.
- ప్రతి తండా గ్రామపంచాయతీకి ఏటా రూ.20 లక్షలు, ఎస్‌సి కార్పొరేషన్లకు రూ.750 కోట్లు, ఎస్‌టి కార్పొరేషన్లకు రూ.500 కోట్లు.
- విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలు పొందిన ఎస్‌సి, ఎస్‌టిలకు ఆర్థిక సాయం.

# 'ఆశా'ల ధర్నా

- అధికారులకు వినతులు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాని కోరుతూ ఆశా కార్యకర్తలు పలు జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణ, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహశీల్దారుకు అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, ఇల్లందు, జూలూరుపాడు మండల కేంద్రాల్లో సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా ర్యాలీ తీశారు. మణుగూరులో కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు పోలేబోయిన శ్రీవాణి సంఘీభావం తెలిపారు. నల్లగొండ జిల్లాలో నల్లగొండలో ఆశా వర్కర్లు తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహశీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు.

## తెలుగు సినీ పరిశ్రమకు జాతీయ అవార్డులు

- హర్షం వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలుగు సినీ పరిశ్రమకు జాతీయ అవార్డులు దక్కడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన దేశీయ చలన చిత్రాలకు ప్రతీయేటా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే జాతీయ అవార్డుల్లో భాగంగా ఇటీవల ప్రకటించిన 69 వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో.. తెలుగు చలన చిత్రాలకు పలు విభాగాల్లో జాతీయ అవార్డులు దక్కడం హర్షణీయమని తెలిపారు. విలక్షణమైన రీతిలో తన అత్యుత్తమ నటన ద్వారా ఉత్తమ జాతీయ నటుడుగా అవార్డు దక్కించుకున్న ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 69 ఏండ్ల కాలంలో మొదటిసారి తెలుగు హీరోకి ఉత్తమ నటుడుగా అవార్డు దక్కడం గొప్ప విషయమన్నారు. కథానాయకుడిగా, పలు సినిమాల్లో వైవిధ్యభరితమైన పాత్రల ద్వారా తెలుగు సహా జాతీయ అంతర్జాతీయ ప్రేక్షకులను అలరించిన అల్లు అర్జున్, తన నటనా ప్రతిభతో మొట్ట మొదటి జాతీయ అవార్డు పొందిన తొలి తెలుగు చలనచిత్ర నటుడుకావడం., తెలుగు చలన చిత్ర రంగానికి గర్వకారణమన్నారు. నాటితరం గొప్పనటుడు అల్లు రామలింగయ్య వారసుడుగా, విలక్షణ నటులైన చిరంజీవి వంటి వారి స్ఫూర్తితో నేటితరం నటుడుగా స్వశక్తితో ఎదిగిన అల్లు అర్జున్ కృషి గొప్పదని తెలిపారు. అదే సందర్భంలో...తన సృజనాత్మక రచనతో సినీ పాటల సాహిత్యానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు, ఉత్తమ సినీ సాహిత్యానికి జాతీయ అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్, ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ కాలభైరవ, ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్ పురుషోత్తమాచార్యులుతో పాటు ఆయా విభాగాల్లో జాతీయ అవార్డులు పొందిన పలు సినిమాలకు చెందిన నిర్మాతలు, దర్శకులు, నటులు,సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## రెండు నెలల కనిష్టానికి విదేశీ మారకం నిల్వలు

ముంబయి : గత ఆరు మాసాల్లో ఎప్పుడూ లేని విధంగా భారత విదేశీ మారకం నిల్వల్లో భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. ఆగస్టు 18తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 7.3 బిలియన్ డాలర్ల మేర క్షీణించి 594.888 బిలియన్లుగా ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఒకే వారంలో ఇంతగా తగ్గడం ఆరు నెలల తర్వాత ఇదే తొలిసారి. దీంతో రెండు మాసాల కనిష్టానికి మారకం నిల్వలు పడిపోయాయి. రూపాయి క్షీణతను అడ్డుకునేందుకు డాలర్లను విక్రయించడంతో నిల్వలు తగ్గాయని ఫారెక్స్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**In the Court of the Senior Civil Judge Court, Kavali.**
**E.P.No.1/2023**
**Nellore O.S.No.311/1993**

Between:
**Siddareddy Ramanareddy** - DHR
VS,
1) **Siddareddy Krishna Prasad** (Died)
2) **Siddareddy Venkata ramanareddy**
3) **Siddareddy Nitya** - JDRs

**To,**
2nd JDR, **Siddareddy Venkataramana Reddy,** S/O **S.K.P.Reddy,** C/O Ragha prasanna,12/B, S.R.Nagar, Balkampet road, Hyderabad-500038.

**2వ JDR కు నోటీసు**

ఈ నంబరున DHR కు రావలిసిన బాకీని వసూలు చేసుకొను నిమిత్తం ఈ నంబరున EP దాఖలు చేయగా శ్రీ కోర్టువారు సదరు EP లోని 2వ JDR అగు మీకు Rule -22 Notice నిమిత్తం **తే21-09-2023ది** నకు వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆదినం **ఉదయం10.30 గంటలకు** శ్రీ కోర్టువారి ఎదుట హాజరై, మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసి ఉన్నది. హాజరు కాని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేదీ :**21-09-2023**

ఇట్లు
**కె.శ్రీనివాసులురెడ్డి,**
DHR తరుపు అడ్వకేట్, కావలి.

**In The Court of The Senior Civil Judge : Gudur, A.P.**
**O.S.No. 2 / 2021**
**Pallamreddy Nagabhushanamma** - Plaintiff
Vs
**1. Bandi Renuka Reddy**
and 9 others - Defendants

**Notice**

**D2. Manoj Kumar Suneetha,**
W/o Late **Manoj Kumar,**
D/o Late **Konduru Venkata Sesha Reddy,** R/o Bhadrachlam Paper Board Colony, Sarapaka, Kothagudem District, Telangana State.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది:4-9-2023**న వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
**ఎస్.మురళీ కృష్ణ,** బి.టెక్., బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది, నెల్లూరు, ఎ.పి.,
సెల్: **62812 83584**

## ఓయు మాజీ విసి కన్నుమూత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఖ్యాతిని పతాకస్థాయికి చేర్చిన మాజీ విసి ప్రొఫెసర్ టి.నవనీతరావు(95) శుక్రవారం రాత్రి హైదరాబాద్ జూబ్లీహిల్స్ తన నివాసంలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శనివారం జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో చిన్న కుమారుడు పూర్తి చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఓయూ విసి ప్రొ. రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మినారాయణ, స్టాన్లీ విద్యాసంస్థల అధినేత కృష్ణారావు, విద్యా సంస్థల చైర్మన్‌లు, పలువురు మాజీ విసిలు, రిజిస్ట్రార్‌లు, విద్యావేత్తలు, అధ్యాపకులు, ఉద్యోగులు ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జూబ్లీహిల్‌లోని ఆయన నివాసంలో మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓయూకు ప్రొపెసర్ నవనీతరావు అందించిన సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 1988, ఆ తర్వాత విద్యాసంవత్సరాన్ని కాపాడారని గుర్తు చేసుకున్నారు.

నవనీతరావు ఓయూ విసిగా రెండు సార్లు పనిచేశారు. అంతకుముందు ఓయూలో డైరెక్టర్‌గా, పీజీ సెంటర్స్ డైరెక్టర్‌గా పని చేశారు. ఓయూ ల్యాండ్స్ సంరక్షణ కోసం ప్రహరీ ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణలో అనేక ఉత్తమ సంస్కరణలు తీసుకొచ్చారు. ఓయూలో బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేసి పలువురు ఓయూ విద్యార్థులకు, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు అవకాశాలు కల్పించారు. అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకొని అమలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని పలువురు అభిప్రాయపడ్డారు.

## కాంట్రాక్టు ఎఎన్‌ఎంల పట్ల మొండి వైఖరి

- రెండుసార్లు చర్చలు జరిపినా స్పందన లేదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఎఎన్‌ఎంల పట్ల మొండి వైఖరి అవలంభిస్తోందని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) హైదరాబాద్ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి అన్నారు. రెండుసార్లు యూనియన్లతో చర్చలు జరిపినప్పటికీ సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలందర్నీ డైరెక్ట్‌గా రెగ్యులర్ చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకుండా మొండిగా రాత పరీక్ష ద్వారానే రిక్రూట్‌మెంట్ చేస్తామని చెప్పడం హేయమైన చర్య అన్నారు. నోటిఫికేషన్‌లో 1520 పోస్టులు ప్రకటించి యూనియన్లతో చర్చలనంతరం 400 పై చిలుకు పోస్టులను పెంచిందన్నారు. అవి ఎలా పెరిగాయని ప్రశ్నించారు. ప్రభుత్వం రాష్ట్ర జనాభా ప్రాతిపదికన, సబ్ సెంటర్ ప్రాతిపదికన గనుక లెక్కలు తీస్తే ఎఎన్‌ఎంల పోస్టులు పెరగడానికి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న ఎఎన్‌ఎంలందరినీ రెగ్యులర్ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నాయకులు రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజీ, విజయ, ప్రణయశీల తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట రెండో ఎఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె కొనసాగింది. తమను రెగ్యులర్ చేయాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒంటికాలుపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు.

# బిఆర్‌ఎస్‌లో అణచివేతకు గురయ్యా

- మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు నా వ్యక్తిగతమే
- వారం తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పార్టీలో అణచివేతకు గురయ్యానని, ఈ విషయంపైనే మెదక్ కార్యకర్తలూ ఆవేదన వ్యక్తం చేశారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మెదక్ ప్రజలు తనకు రాజకీయ భిక్ష పెట్టారన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని ఆయన నివాసానికి శనివారం పెద్దఎత్తున మెదక్, మల్కాజిగిరి బిఆర్‌ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. ఇటీవల తిరుమలలో మంత్రి హరీశ్‌రావుపై మైనంపల్లి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన భవిష్యత్ కార్యాచరణపై నాలుగు రోజులుగా చర్చ జరుగుతోంది. బిఆర్‌ఎస్ అధిష్టానం మైనంపల్లి కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ టికెట్ నిరాకరించడంతో అనుసరించాల్సిన వ్యూహాలపై అనుచరులతో మైనంపల్లి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా వెన్నుపోటు పొడిచే అలవాటు తనకు లేదన్నారు. ప్రాణం పోయే వరకూ మాటపైనే ఉంటానని చెప్పారు. తాను ఎప్పుడూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిలను తిట్టలేదన్న మైనంపల్లి, అంతా కలిస్తేనే తెలంగాణ సాధ్యమైందన్నారు. తాను పార్టీని ఏమీ అనలేదనీ, పార్టీ కూడా తనను ఏమీ అనలేదని చెప్పుకొచ్చారు.

**వారంలో నిర్ణయం**

పార్టీలు ముఖ్యం కాదని, మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, కార్యకర్తలే సర్వస్వం అన్నారు. ఆస్తులు అమ్మి అయినా సరే వారిని కాపాడుకుంటానని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానన్నారు. మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు తన వ్యక్తిగతమే అన్నారు. తన కుమారుడి ఇష్టాన్ని కాదనలేనని, మల్కాజిగిరి, మెదక్‌లో వారం రోజులపాటు పర్యటించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

తాను వెనక్కి తగ్గే వ్యక్తిని కాదన్న మైనంపల్లి, చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. తనను వ్యక్తిగతంగా ఇబ్బంది పెడితే తాను కూడా ఇబ్బంది పెడతానని తెలిపారు. బిఆర్‌ఎస్‌లో ఓ పెద్ద నాయకుడు తనకు ఫోన్ చేసి తొందర పడొద్దని చెప్పారని, ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని ఆ నాయకుడు సూచించినట్టు చెప్పారు. మీడియాతో మాట్లాడొద్దని ఆ నాయకుడు ఒట్టు కూడా వేయించుకున్నాడని తెలిపారు. మెదక్‌లో తన కొడుకు తిరిగి ప్రజాభిప్రాయం కోరుతాడని వెల్లడించారు. మెదక్ ప్రజలు ఏది చెబితే తన కొడుకు అది చేస్తాడన్నారు. తన కంటే తన కొడుకు ఎక్కువ పని చేస్తున్నాడని, ఆయన్ను ఎందుకు సెట్ చేయొద్దని ప్రశ్నించారు. జీవితంలో సెటిల్ అనేది ఉండదన్న మైనంపల్లి, తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా పోటీ చేసి ఓడానని.. ఓటమితో వెనుకాడే వ్యక్తిని కాదన్నారు. రాజకీయాల కోసం వ్యక్తిత్వం మార్చుకునే వ్యక్తిని కాదన్నారు. తనను ఎవరు ఇబ్బంది పెడితే వారిని తిడతా అని, వ్యక్తిగతంగా ఎవరినీ తిట్టను అని చెప్పుకొచ్చారు. మెదక్‌లో సొంత పార్టీ నేతలపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలతో చర్చించి వారు ఇచ్చే సందేశాలతో ముందుకెళ్తానన్నారు. పార్టీ మార్పు గురించి మల్కాజిగిరి ప్రజలు ఏది చెబితే, అది చేస్తానని చెప్పారు. ఊహాజనితమైన వార్తలు రాయొద్దని కోరారు.

## బిడి టేకేదారులకు పింఛన్ల పంపిణీ

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలు సంతోషంగా ఉండాలని దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని బిసి సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బిడి టేకేదారులకు నూతన పింఛన్లు, వికలాంగులకు పెంచిన ఆసరా పింఛన్ల పంపిణీని శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని అవయవాలు పని చేసినా వక్రబుద్ధితో ఉన్నవారే అసలైన వికలాంగులని, ఎలాంటి కల్మషం లేకపోయినా విధి శాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారు దైవసమానులని చెప్పారు. వారు సమాజంలో చులకన భావానికి గురికాకుండా, సగౌరవంతో బతకాలని వికలాంగులను అక్కున చేర్చుకుని రూ.4016, బిడి టేకేదారులకు రూ.2016 పింఛన్ అందిస్తున్నామని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని 15 మండలాలు, 5 మున్సిపాలిటీలలో 1,38,135 మందికి పింఛన్లు అందించగా, అందులో 23641మంది వికలాంగులు, 40మంది బిడి టేకేదారులు ఉన్నారన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే 6433 మంది వికలాంగులకు రూ.4016 చొప్పున రూ.2,58,34,928, 10మంది బిడి టేకేదారులకు రూ.2016 చొప్పున రూ.20,160 పింఛన్ల రూపంలో అందిస్తున్నామన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని బిడి టేకేదారులకు ప్రొసీడింగ్స్, వికలాంగులకు రూ.2,58,34,928 చెక్కును అందజేశారు.

కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ డాక్టర్ బి.గోపి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌డిఒ శ్రీలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేపర్ ప్రకటన
**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఓ.ఎస్.నెం.577/2021**

ఆకుల అనిల్‌కుమార్ ..... వాది
వర్సెస్
ఆకుల అంకయ్య మరియు ముగ్గురు ...ప్రతివాదులు

ప్రతివాది చిరునామా:
2వ ప్రతివాది/ఆకుల మధుసూదన్ తండ్రి ఆకుల అంకయ్య, వయస్సు సుమారు 31సం॥లు, హిందూ, ప్రైవేటు ఎంప్లాయ్, ప్రస్తుతం నివాసం ఇంటి నెం.11-108, శాంతి నగర్ కాలని, పఠాన్ చెరువు పోస్టు& మండలం, మెదక్ జిల్లా.

పై నెంబరు దావాలోని వాది దావా ప్లెయింటు పరిహారం రాగోరి మీపై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 1వ తేదీ సెప్టెంబర్ 2023 సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమునందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
**తేది:24.08.2023**
శ్రీ షేక్.యాసిన్‌బాషా
వాది తరుపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.**9346513649**

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**I.A.NO 755/2021**
**IN**
**O.S.NO 444/2003**

క్రైపా రాజేశ్వరరెడ్డి ...పిటిషనర్ / వాది
**వర్సస్**
క్రైపా పాండు రంగారెడ్డి వగైరాలు
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

**To**
**5వ రెస్పాండెంట్ / ప్రతివాది**
ఇసిరెడ్డి పార్వతమ్మ భర్త వెంకట నారాయణరెడ్డి, వయస్సు 60 సంవత్సరాలు, డోర్ నెం 29-1458-4-1, హౌస్ నెం 243, వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నెం 43, నేరేడుమెట్ట క్రాస్ రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబర్ పిటిషన్ లోని పిటిషనర్ ఫైనల్ డిక్రీ పిటిషన్ పరిహారం కోరుచూ మీ వగైరాలపై పై కోర్టులో ఫైనల్ డిక్రీ పిటిషన్ దాఖలు చేసియున్నాడు. సదరు పిటిషన్ లో మీరు కోర్టుకు వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 06-09-2023 వ తేదీ యున్నది. వాయిదా రోజు ఉదయం 10-30 నిమిషాలకి నీవు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును.

**// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //**
గిద్దలూరు
తేదీ 25-08-2023

ఇట్లు
శ్రీ బి.డి గిరి, **MA.,LLB.,D.Agril**
పిటిషనర్/వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్

## కరెంట్ స్తంభంపై కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుద్ఘాతంతో కరెంట్ స్తంభంపైనే కార్మికుడు ప్రాణం వదిలాడు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ బంజారా హిల్స్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలంక గ్రామానికి చెందిన పెదబాబు(36) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి హైదరాబాద్ జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. పెదబాబు విద్యుత్ శాఖలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం విధుల్లో భాగంగా బంజారాహిల్స్ శ్రీనగర్ కాలనీలోని ప్రధాన రహదారిలో ఉన్న వెంకటేశ్వర నివాసంలో కరెంటు పోల్ ఎక్కాడు. ఆ సమయంలో కరెంట్ షాక్ తగలడంతో వెంటనే ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## పల్లవి ఇంజనీరింగ్ కాలేజీకి న్యాక్ గుర్తింపు

హైదరాబాద్ : నాగోల్ కుంట్లూరులోని పల్లవి ఇంజనీరింగ్ కాలేజీ (పిఇసి)కి న్యాక్ గుర్తింపు లభించిందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం నవీన్ కుమార్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ డైరెక్టర్ జె గోవర్ధన్, ప్రిన్సిపల్ ఎంబి రాజు, డైరెక్టర్ (ప్లేస్‌మెంట్స్) సుమేధా రమేష్ కెతో కలిసి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. పిఇసి ఐదేళ్ల కాలానికి గాను న్యాక్ 'ఎ' గ్రేడ్ పొందినట్లు పేర్కొంది. గత 30 ఏళ్లుగా పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్ట్యూషన్స్ విద్యా రంగంలో నిరంతర సేవలందిస్తోందన్నారు. తమ గ్రూప్ కింద ఐదు ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లు, 13 పల్లవి ఇంటర్నేషనల్, మోడల్ స్కూల్స్ ఉన్నాయన్నారు. అదే విధంగా డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలను నిర్వహిస్తోందన్నారు. పిఇసిలో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ సైన్స్, సిఎస్ఇ, ఎంబిఎ కోర్సులను అందిస్తున్నామన్నారు. సగటు ఉత్తీర్ణత 75 శాతంగా ఉందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఏడాదికి 30 లక్షల వరకు వేతనం పొందిన వారు ఉన్నారన్నారు. తమ యాజమాన్యం సమీప భవిష్యత్తులో ప్రయివేటు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని యోచిస్తోందన్నారు.

## మంచిరేవులలో ఫారెస్టు ట్రెక్ పార్క్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చిల్కూర్ ఫారెస్ట్ బ్లాక్ పరిధిలోని మంచిరేవులలో రూ. 7.38 కోట్ల వ్యయంతో 256 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌ను అటవీ పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, భూగర్భ గనుల, సమాచార శాఖ మంత్రి మహేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం కోటి వృక్షార్చనలో భాగంగా మంత్రులు మొక్కలు నాటారు. సఫారీ వాహనంలో పార్కు అంతా కలియ తిరిగారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. 109 అర్బన్ ఫారెస్ట్ పార్కులకు గాను ఇప్పటివరకు 73 పార్కులు అందుబాటులోకి వచ్చాయని, ఈ రోజు 74వ పార్కును ప్రారంభించుకున్నామని తెలిపారు. 256 ఎకరాల విస్తీర్ణంలో 5.6 కి.మీ ఉన్న ఈ పార్కులో సుమారు 50 వేల రకాల మొక్కలు ఉన్నాయన్నారు. ట్రెక్కింగ్ ట్రాక్ 2 కి.మీ, వాకింగ్ ట్రాక్ 4 కి.మీ ఉందని వివరించారు. ఈ ప్రాంత భౌగోళిక స్వరూపం ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఉండటంతో సరికొత్త థీమ్‌తో ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు.

# అంతర్మథనంలో బిఆర్ఎస్ అసంతృప్తులు!

- ధిక్కార స్వరం వినిపించని ఆశావహులు
- మౌనం వెనుక ఆంతర్యమేంటి..?
- అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే ఛాన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆశావహులు అంతర్మథనంలో పడ్డారు. ధిక్కార స్వరం వినిపించలేకపోతున్నారు. మొన్నటి వరకు తమకే టికెట్లు వస్తాయని ఆశించిన నాయకులకు అధిష్టానం మొండి చేయి చూపింది. ఆశావహులు పునరాలోచనలో పడ్డారు. టికెట్ దక్కకపోవడంతో చేసేదేమీ లేక మౌనం దాల్చారు. బుజ్జగింపులకూ నోచుకోవడం లేదు. రాయబారాలు లేవు. అసంతృప్తితో లోలోపల తీవ్ర మనోవేదనకు గురవుతున్నా.. బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆశావహుల మౌనం వెనుక ఆంతర్యం ఏముందో.. కార్యకర్తలకు కూడా అర్థం కావడం లేదు. ఇలాగే కొనసాగితే ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాలకూ బిఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం కల్పించగా.. ఉప్పల్ అభ్యర్థిని మాత్రమే మార్చారు. అయినా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి నిరసనలు, ఆందోళనలు జరగడం లేదు. లోపల అసమ్మతి రాజుకుంటున్నా.. బయటకు రానీయడం లేదు. తమ సమీప కార్యకర్తల దగ్గర అధిష్టానం వ్యవహరించిన తీరు గురించి చెబుతూ.. పార్టీకి తాను చేసిన సేవ.. పార్టీ తనకు చేసిన అన్యాయం గురించి చర్చిస్తున్నారు. అధిష్టానం తీరు మారుతుందేమో అని కొందరు ఎదురు చూస్తున్నారు. ఇంకొందరు పార్టీని వీడేది లేదని బహిరంగంగానే చెబుతున్నారు.

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి పోటీ పడ్డారు. చివరకు బిఆర్ఎస్ అధిష్టానం బండారి లక్ష్మారెడ్డి వైపే మొగ్గు చూపింది. కూకట్‌పల్లి నియోజవర్గంలో ముగ్గురు నాయకులు టికెట్ ఆశించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ అవకాశం రావడంతో ఎమ్మెల్సీ నవీన్‌రావు, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు సైలెంట్ అయ్యారు. ఇక్కడ వెంకటేశ్వర్‌రావు బిఆర్ఎస్ రెబెల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సైతం ఇద్దరు పోటీ పడగా.. సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకాంద్‌కే టికెట్ దక్కింది. ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజుకు నిరాశే మిగిలింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ధిక్కార స్వరం వినిపిస్తుండటంతో శంభీపూర్ రాజు అభ్యర్థిత్వంపై అధిష్టానం మరోసారి ఆలోచిస్తున్నట్టు సమాచారం. మేడ్చల్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ కోసం పోటీ పడ్డారు. కానీ అధిష్టానం మాత్రం మళ్లీ మల్లారెడ్డికే టికెట్ కేటాయించడంతో సుధీర్‌రెడ్డి పునరాలోచనలో పడ్డారు. సుధీర్‌రెడ్డి కుమారుడు జెడ్పీ చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. తాను పార్టీ మారితే తన కుమారుడి రాజకీయ భవిష్యత్ ఏంటి..? తనతోపాటు ఇతర పార్టీలోకి తీసుకెళ్లాలా..? లేక తానొక పార్టీ, కుమారుడు మరో పార్టీలో కొనసాగాలా..? అని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఇద్దరు వేర్వేరు పార్టీల్లో కొనసాగితే పరిస్థితులు ఎలా ఉంటాయని లెక్కలేసుకుంటున్నారు. ఇక మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తప్ప మరెవరూ టికెట్ కోసం ఆశ పడలేదు. చింతల కనకారెడ్డి కోడలు విజయశాంతి పోటీలో ఉన్నా.. పేరు అంతగా ప్రచారంలోకి రాలేదు. మల్కాజిగిరి టికెట్ మైనంపల్లికే వచ్చినా తన కొడుక్కి మెదక్ అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

### గెలుపోటములపై ప్రభావం

అసంతృప్తుల మౌనం ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రమాదంగా మారే అవకాశం లేకపోలేదు. ఇప్పటికిప్పుడు ధిక్కార స్వరం వినిపించి తిరుగుబాటు చేయకున్నా.. ఎన్నికల సమయంలో కలిసి పని చేయడం కష్టమే. టికెట్ ఆశించి భంగపడిన వారిని బుజ్జగించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ప్రచారం చేస్తారనే నమ్మకం లేదు. బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని వారి వారి క్యాడర్‌కు ఆదేశాలు జారీ చేసే అవకాశం కూడా ఉండకపోవచ్చు. ఇలాంటి పరిణామాలు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు సైలెంట్‌గా ఉండి చివరి నిమిషంలో రెబెల్‌గా పోటీలో ఉండే అవకాశాలు లేకపోలేదు.

## హరితహారం ఓ మహోన్నత కార్యం

- కోటి వృక్షార్చనలో మండలి చైర్మన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావుతో కలిసి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హరితహారం అనే మహోన్నత కార్యక్రమని చెప్పారు. తెలంగాణలో అటవీ విస్తీర్ణం, పచ్చదనం బాగా పెరిగిందన్నారు. రాష్ట్రాన్ని ఆకుపచ్చని రాష్ట్రంగా మార్చిన ఘనత సిఎంకు దక్కిందని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో కూడా ఎంతో గొప్పగా అభివృద్ధిని సాధించిందన్నారు.ఈ కార్యక్రమంలోఅసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహా చార్యులు, బీఆర్ఎస్ ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పల్లాపై ముత్తిరెడ్డి ఆగ్రహం

- వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీలో నుంచి బిఆర్ఎస్‌లో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భేషరతుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓం సాయి ఫంక్షన్ హాల్‌లో వికలాంగులు ఆసరా పెన్షన్ పెంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆనాడు సిఎం కెసిఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలను ప్రభుత్వంలో భాగస్వాములను చేస్తే వారిని కుక్కలుగా అభివర్ణించడం సరైంది కాదన్నారు. అజ్ఞానం, డబ్బు బలంతో ఇష్టానుసారంగా మాట్లాడటం అతని దురహంకారానికి నిదర్శమన్నారు. ఇప్పటికైనా బేషరతుగా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఎం అన్ని విధాల రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరొక్కసారి కెసిఆర్‌ను ప్రజలు దీవించి అధికారంలోకి తేనున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.సిద్ధిలింగం, ఎంపిపి మేకల కళింగరాజు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 110 కోట్ల చేపల ఉత్పత్తి

- నీరున్న దగ్గర చేపలు ఉండాల్సిందే
- 26వేల చెరువుల్లో మత్స్య సంపద
- మరో రూ.100 కోట్లయినా ఇస్తాం
- మత్స్య కార్మిక శాఖ మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో నీరున్న దగ్గర చేపలు ఉండాల్సిందేనని, కెసిఆర్ సంకల్పం మేరకు నేడు 26వేల చెరువుల్లో మత్స్య సంపద పెంచుతున్నామని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రూ.110 కోట్ల మేర చేపల ఉత్పత్తికి చేరుకున్నామని చెప్పారు. దీని కోసం మరో రూ.వంద కోట్లయినా ఇస్తామన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంత్రి పర్యటించారు. ఇబ్రహీంపట్నంలో రూ.2 కోట్లతో ఫిష్ మార్కెట్, సీతారాంపేటలో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పిఎసిఎస్ గోదాం, సాగర్‌రోడ్డు నుంచి ఉప్పరిగూడ వరకు నిర్మించిన నూతన రోడ్డును మంత్రి ప్రారంభించారు. అలాగే జెబీ వెంచర్‌లో మొక్కలు నాటారు. పెద్ద చెరువులో చేప, రొయ్య పిల్లలు వదిలారు. అనంతరం మత్స్యకారులకు

చెరువులో చేప, రొయ్య పిల్లలను వదులుతున్న తలసాని

గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా 2016 నుంచి అన్నీ నీటి వనరుల్లో చేప, రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. చేపలు, చేపల వంటకాల విక్రయాలు జరుపుకొనేందుకు వీలుగా ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనాలను 60 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్టు చెప్పారు. గతంలో 600 చెరువుల్లోనే చేపలను విడుదల చేస్తే.. ప్రస్తుతం 26వేల చెరువుల్లో పెంచుతున్నామని చెప్పారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ మత్స్య శాఖలో సొసైటీ సభ్యులుగా చేరే అధికారం ఉందన్నారు. వెయ్యి సొసైటీలు ఏర్పాటు చేశామని, లక్ష మందికి సభ్యత్వం కల్పించామన్నారు. ముదిరాజులు, గంగపుత్రులు ఒకరికొకరు అన్నదమ్ముల్లాగా కలిసి తమ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాలని సూచించారు. తెలంగాణలో జరుగుతున్న సకల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కొంతమంది జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. సిఎం కెసిఆర్ కులవృత్తుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాంనాయక్, జేడీ రాథోడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సుకీర్తి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బూడిద రాంరెడ్డి, రైతుబంధు జిల్లా కన్వీనర్ వంగేటి లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మెన్ ఏర్పుల చంద్రయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, మత్స్య సొసైటీ అధ్యక్షులు దివిటి రాములు, కార్యదర్శి గుంటి భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

వర్కషాప్‌లో మాట్లాడుతున్న వీరయ్య

## మతతత్వ బిజెపిని ఓడించండి : సిపిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మతతత్వ బిజెపిని ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డిజి.నర్సింహారావు కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో రెండ్రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల వాగ్దానాలను పక్కదోవ పట్టించడానికి మతం, ప్రాంతాలను వాడుకుంటూ రెండోసారి తన అధికారాన్ని నిలబెట్టుకుందన్నారు. మళ్లీ ఎన్నికల్లో గెలవడానికి అనేక వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా ఎన్నికల ఎత్తుగడలో భాగంగా అయోధ్యలో నిర్మిస్తున్న రామాలయానికి దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 'నా దేశం నా మట్టి' అనే నినాదం చేస్తోందన్నారు. మణిపూర్‌లో కొద్ది నెలల నుంచి రెండు తెగల మధ్య అల్లర్లు జరుగుతుంటే ప్రధాని కనీసం ఒక్క స్టేట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. మణిపూర్ రావణకాష్టంలాగా తగలబడుతుంటే మోడీ విదేశీ పర్యటనలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో ఆదివాసులు నివసించే ప్రాంతంలో ఉన్న అపారమైన గనులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పటానికి వంద మంది గిరిజనుల ప్రాణాలను పనంగా పెట్టిందన్నారు.

డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. లాభాల్లో నడుస్తున్న అనేక పబ్లిక్ సెక్టార్స్ ఓడ రేవులు, విమానయాన సంస్థలను బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకు అనుకూలంగా ఉన్న వారికి కారు చౌకగా కట్టబెట్టినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మోడీ ప్రభుత్వ హయాంలో మూడింతలు పెరగ్గా.. కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను రోడ్డున పడేసే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే సామాన్యులు, మధ్యతరగతి వారు బతకలేని పరిస్థితి దాపురిస్తుందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటేసి బిజెపిని గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.750 కోట్ల ఆదాయం లక్ష్యం

- లింకన్ ఫార్మాస్యూటికల్స్ వెల్లడి

**హైదరాబాద్:** వచ్చే 2026 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.750 కోట్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు లింకన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తెలిపింది. నికర రుణ రహిత హోదాలను కొనసాగిస్తూనే ఆదాయం, లాభాల్లో మెరుగైన ప్రగతిని కనబర్చాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. తొలిసారిగా రూ. 1000 కోట్లకు పైగా మార్కెట్ కేపిటలైజేషన్ సాధించినట్లు వెల్లడించింది. ఆగస్ట్ 25న ఈ కంపెనీ షేరు రూ.479.50 వద్ద ముగిసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.500 కోట్లకు పైగా రెవెన్యూ, రూ.100 కోట్లకు పైగా పన్నుకు ముందు లాభాలు నమోదు చేసినట్లు పేర్కొంది.

LPL LINCOLN PHARMACEUTICALS LTD. HEALTHCARE FOR ALL

## 2047 నాటికి 23 కోట్ల ఇళ్లు అవసరం

- రూ.500 లక్షల కోట్లకు రియల్ ఎస్టేట్
- నారెడ్కో- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్

**హైదరాబాద్ :** భారత రియాల్టీ రంగం 2047 నాటికి 5.83 ట్రిలియన్ డాలర్ల విలువకు చేరొచ్చని నైట్ ఫ్రాంక్, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) సంయుక్తంగా అంచనా వేశాయి. ఇది రూపాయి కరెన్సీలో రూ.480 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం జిడిపిలో ఈ రంగం 7.3 శాతం వాటాను కలిగి ఉండగా.. 15.50 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. శనివారం హైదరాబాద్‌లో నైట్‌ఫ్రాంక్- నారెడ్కో రూపొందించిన విజన్ 2027 రిపోర్ట్‌ను భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, నార్కెడ్కో ప్రెసిడెంట్ రాజన్ బందెల్కర్, నైట్‌ఫ్రాంక్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గులామ్ జియా, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ నివేదిక ప్రకారం.. రియల్ ఎస్టేట్ రంగంలో నివాస సెగ్మెంట్‌కు అధిక వాటా ఉంటుంది. 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 33-40 ట్రిలియన్ డాలర్ల మధ్య

ఉండొచ్చని అంచనా. రాబోయే 25 సంవత్సరాలలో దేశంలో 23 కోట్ల ఇళ్ల అవసరముండొచ్చు. 2047 నాటికి భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 12 రెట్లు పెరగొచ్చు. ఆఫీస్ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 473 బిలియన్ డాలర్లకు పెరగనుంది. గతేడాది ఇది 40 బిలియన్ డాలర్లుగానే ఉంది.

కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్

## సత్వర న్యాయం అందేలా చూడాలి

- చీఫ్ జస్టిస్ అలోక్ అరధే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరితగతిన కేసుల విచారణ చేపట్టడంతోపాటు సత్వర న్యాయం అందించినప్పుడే ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడ పారిశ్రామికవాడలోని 'ఆపెల్' భవనంలో తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసిన జిల్లా కోర్టుల సముదాయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిజె మాట్లాడుతూ.. రాజ్యాంగపరమైన న్యాయ హక్కుల సాధనకు, ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం దక్కేలా చూడాల్సిన ఆవశ్యకతను గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, రాచకొండ సిపి డిఎస్.చౌహాన్, టీఎస్ఐఐసి ఎం.డి ఇ.వెంకట నర్సింహా రెడ్డి, మాజీ చీఫ్ జస్టిస్ పి.నవీన్ రావు, హైకోర్టు న్యాయమూర్తి టి.వినోద్ కుమార్, వివిధ కోర్టుల న్యాయమూర్తులు ఆర్.రఘునాథ్‌రెడ్డి, బి.అర్.మధుసూదన్‌రావు, డి.ఎస్.ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, రిజిస్ట్రార్ జనరల్ తిరుమల దేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

## రాంపూర్ చిన్నది.. మనస్సు పెద్దది

- మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాంపూర్ గ్రామం చిన్నదైన మనసు పెద్దదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా రూరల్ మండలంలోని రాంపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనం, రెడ్డి కుల సంఘ భవన నిర్మాణం పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. డంప్ యార్డు, శ్మశాన వాటికకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామానికి వచ్చేదాకా నాకు ఏకగ్రీవ తీర్మానం చేశారని తెలియదని, తీర్మానం చేసినందుకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలని తెలిపారు. తొలి బోణీ మీదేనని, సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చాక వచ్చిన మొదటి గ్రామం ఇదేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన తర్వాత చిన్న గ్రామమైన రాంపూర్‌లోనే యాసంగిలో 18 లారీల ధాన్యం పండించారని చెప్పారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటే సరిపోతదని కాంగ్రెస్, బిజెపి నాయకులు అంటున్నారని, తెలివితోనే మాట్లాడుతున్నారా లేదా మీరే ఆలోచించాలన్నారు. కాంగ్రెస్, బిజెపి నాయకులు తిట్టడంలో పోటీ పడితే.. సీఎం కేసీఆర్ పుట్ల వడ్లు పండించడంలో పోటీ పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కృషివల్లే ఇతర రాష్ట్రాలకు ధాన్యం ఎగుమతి చేసే స్థాయిలో తెలంగాణ ఉందన్నారు. ఆసరా, కల్యాణ లక్ష్మి, రైతుబంధు వంటి పథకాలు అమలు పరిచి అందరి అభివృద్ధి కోసం సిఎం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతు అర్ధాంతరంగా చనిపోతే రూ.5 లక్షల ఆర్థిక సాయం చేసి ఆ రైతు కుటుంబానికి పెద్దన్నలా కెసిఆర్ నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, సర్పంచ్ ఏర్పుల బిక్షపతి, వైస్ ఎంపిపి యాదయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ లక్కర్స్ ప్రభాకర్ వర్మ, ఉప సర్పంచ్ విట్టల్ రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ గ్రామ సర్పంచులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు వారాలుగా నష్టాలే..

- మార్కెట్ల సుదీర్ఘ పతనం
- సూచీలపై సన్నగిల్లుతోన్న విశ్వాసం

**ముంబయి :** భారత స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్లకు విశ్వాసం సన్నగిల్లుతోంది. వరుసగా ఐదో వారంలోనూ నష్టాలు చవి చూశాయి. ఆగస్ట్ 25తో ముగిసిన వారంలోనూ సూచీలు క్షీణించాయి. గడిచిన 15 మాసాల్లో ఇదే సుదీర్ఘకాల పతనం కావడం ఆందోళకరం. ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) చైర్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు ప్రపంచ మార్కెట్లు శుక్రవారం అప్రమత్తంగా ఉండటంతో పాటుగా దేశీయంగా ద్రవ్యోల్బణ భయాలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. గడిచిన ఐదు సెషన్లలోనూ అమ్మకాల వెల్లువ కొనసాగింది. వారాంతం సెషన్‌లో సెన్సెక్స్ 366 పాయింట్లు కోల్పోయి 64,886 వద్ద ముగిసింది. నిఫ్టీ 121 పాయింట్ల నష్టంతో 19,266 వద్ద ముగిసింది. వారంలో సెన్సెక్స్, నిఫ్టీ50 వరుసగా 0.1 శాతం మరియు 0.2 శాతం చొప్పున క్షీణించాయి. ఇంతక్రితం 2022 మేలో చోటు చేసుకున్న వరుస నష్టాల తర్వాత మళ్లీ ఇప్పుడు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఏప్రిల్ 2020లో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు వరుసగా ఏడు వారాల పాటు పడిపోయాయి. సమీపకాలంలోనూ ద్రవ్యోల్బణం మరింత పెరగనుందన్న ఆర్‌బిఐ అంచనాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సరఫరా అంతరాయాల కారణంగా రానున్న నెలల్లో ప్రధాన ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని విశ్లేషించింది. నైరుతి రుతుపవనాల ప్రభావం, భౌగోళిక రాజకీయ ప్రతికూలతల కారణంగా ప్రపంచ ఆహార ధరలపై ఒత్తిడి పెరగొచ్చని హెచ్చరించింది. దేశ ఆర్థిక వ్యవస్థలోనూ పెద్ద సానుకూలతలు, పురోగతి కనబడటం లేదు. ఈ పరిణామమూ సూచీల అమ్మకాలకు పురిగొల్పుతోంది.

### రిలయన్స్ సూచీ 3.4 శాతం పతనం

గడిచిన ఐదు సెషన్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ అధికంగా 3.4 శాతం నష్టపోయింది. ఆగస్ట్ 18న రూ.2,556.7 వద్ద నమోదయిన సూచీ.. 25న రూ.2,470కి పడిపోయింది. సన్ ఫార్మా సూచీ 2.3 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 2.1 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 1.8 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 1.8 శాతం చొప్పున పతనమయ్యాయి. గతవారం అధికంగా లాభపడిన వాటిలో బజాజ్ ఫైనాన్స్ 5.1 శాతం, యాక్సిస్ బ్యాంక్ 4.3 శాతం, ఆసియన్ పెయింట్స్ 3.1 శాతం, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.0 శాతం, ఇన్ఫోసిస్ 2.3 శాతం చొప్పున పెరిగాయి. ఆగస్ట్ 18న బిఎస్ఇ సెన్సెక్స్ 64,948 వద్ద ఉండగా.. వారాంతం నాటికి 64,886.5కు పడిపోయింది. ఆగస్ట్ 28 నుంచి ప్రారంభం కానున్న వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రధానంగా విదేశీ పరిణామాలు ప్రభావితం చేయవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఎయిరిండియాల్లో భద్రత లోపాలు

**న్యూఢిల్లీ :** టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియాలో భద్రత లోపాలను గుర్తించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వెల్లడించింది. ఇద్దరు సభ్యుల తనిఖీ బృందం అంతర్గత భద్రతా ఆడిట్‌లలో లోపాలను గుర్తించింది. జూలై 25- 26 తేదీల్లో హర్యానాలోని గురుగ్రామ్‌లోని ఎయిరిండియా కార్యాలయ తనిఖీల్లో ఇవి బయటపడ్డాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోందని డిజిసిఎ డైరెక్టర్ జనరల్ విక్రమ్ దేవ్ దత్ తెలిపారు. 13 సేఫ్టీ పాయింట్ల తనిఖీల్లో మొత్తం 13 కేసుల్లో ఎయిర్‌లైన్ తప్పుడు నివేదికలు సమర్పించిందని సమాచారం. సాధారణ భద్రతా నిబంధనలకు లోబడే తమ విధానాలున్నాయని ఎయిరిండియా పేర్కొంది.